

పంచాంగం వినిపిస్తున్న శఠగోపాచార్యులు

## టీటీడీ కల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం

పోచమ్మమైదాన్, మార్చి 30 : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం పంచాంగ శ్రవణం గావించారు. ప్రముఖ సంస్కృత పండితుడు సముద్రాల శఠగోపాచార్యులు విశ్వావసు నామ సంవత్సరం ఫలితాలను వివరించారు. దేవుడిపై అత్యంత భక్తి విశ్వాసం కలిగి ఉండాలని, అప్పుడే అనుకున్న శుభ ఫలితాలు సాధిస్తారని చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి కృష్ణమూర్తి, కనపర్తి రఘువీర్, తెన్నేటి వసుంధర, బన్న శ్రీకాంత్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## కవయిత్రి వకుళ వాసుకు బహుమతి



పోచమ్మమైదాన్, మార్చి 30 : ఉదయ సాహితీ, తెలంగాణ (సాహిత్య వికాస వేదిక) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీల్లో హనుమకొండకు చెందిన కవయిత్రి వకుళవాసు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కోనసీమ జిల్లాకు చెందిన నాగజ్యోతికి ప్రథమ బహుమతి, నెల్లూరు జిల్లాకు చెందిన సుధీర్‌కుమార్‌కు తృతీయ బహుమతి పొందారు. తెలంగాణకు చెందిన వకుళవాసు ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య తెలిపారు. తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వకుళవాసు కవయిత్రి రాసిన 'రేపటి కవనాన్ని' కవితకు బహుమతి పొందారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం
### కాపాడిన పోలీసులు

మడికొండ, మార్చి 30 : మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోచమ్మ గుడి వద్ద నివసించే నర్రా శ్రీనివాస్ ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి శనివారం రాత్రి వెళ్లిపోయాడు. అతడి భార్య, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరక్క పోవడంతో ఆదివారం అతడి భార్య శారద పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్యాయత్నం చేస్తుండగా అడ్డుకొని పోలీస్ స్టేషన్ తీసుకొచ్చారు. అనంతరం అతడిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం**



★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918.
NTW-000

**PLOT FOR SALE**



★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



ఎల్కతుర్తి : పంచాంగం చదువుతున్న పండితుడు



కాజీపేట : ప్రశాంతినగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు



ధర్మసాగర్ : ముప్పారం ముఖ్యనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# అంబరాన్నంటిన ఉగాది సంబురాలు

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉదయం నుంచే బారులు తీరిన భక్తులు
- అన్ని వసతులు కల్పించిన దేవాలయ కమిటీలు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 30 : జిల్లాలో శ్రీవిశ్వావసు నూతన తెలుగు సంవత్సరాది, ఉగాది సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం అన్ని ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల కొత్త పంచాంగం చదివి వినిపించారు. మొక్కులు చెల్లించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. ఆయా ఆలయ కమిటీల బాధ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు. విశ్వావసు సంవత్సరమంతా పాడిపంటలు, వ్యాపారాలు, ఆయురారోగ్యాలు కలుగజేయాలని భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. ఇంటి వద్ద తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు వంటి ఆరు పదార్థాలతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. అనంతరం ఆలయాల్లో నిర్వహించిన విశ్వవసు నామ సంవత్సర పంచాగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలోని శ్రీ ముఖ్యనాథస్వామి దేవస్థానంలో ప్రజలు అందరు ఉగాది పచ్చడి బోనం, నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో అర్చకుడు భాను పంచాంగ శ్రవణం చేశారు. శాయంపేట మండలంలోని కొప్పుల, గంగిరేణిగూడెం గ్రామాల గౌడ కులస్తులు కంఠమహేశ్వరుడు, సురమాంబ దేవతలు, ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. పెద్దకోడెపాక శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు అనుదీప్ శర్మ పూజలు చేశారు. పెద్దకోడెపాక గ్రామంలో కురుమ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్నకు పూజలు చేశారు. శాయంపేటలోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరిస్వామి దేవాలయంలో అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచారి పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ చైర్మన్ సామల భిక్షపతి పాల్గొన్నారు. వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు మహేశ్‌శర్మ స్వామి వారికి ఉగాది పచ్చడి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన పంచాంగం చదివి వినిపించారు. 66 డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో పురోహితలు రమేశ్‌శర్మ, పార్థసారథి, గురుదత్తు, రమేశ్, వెంకటస్వామి, సంపత్, కృష్ణమూర్తి, భద్రదేవ్, శ్రీనివాస్, అజిత్, సుమన్, రాజేశ్‌ను సన్మానించి నూతన పంచాంగం అందజేశారు. ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నూతన పంచాంగాన్ని ఆవిష్కరించి పఠనం చేశారు. దామెర మండలం ఊరుగొండలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, శ్రీఆంజేయస్వామి ఆలయాల్లో అర్చకులు తూపురాణి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ల్యాదెళ్లలో మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, దామెరలో మాజీ జడ్పీటీసీ గరిగె కల్పన-కృష్ణమూర్తి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కొంక అశోక్ ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. కాజీపేట పట్టణంలోని శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయం, సోమిడిలోని సోమేశ్వర స్వామి, రైల్వే దేవాలయ సముదాయం, డీజిల్ కాలనీలోని ఆంజనేయస్వామి, ప్రశాంత్‌నగర్, చైతన్యపురిలో రామాలయం, వెంకటేశ్వరస్వామి, వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



వేలేరు : మల్లికుదుర్ల గట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో పంచాంగం వింటున్న భక్తులు

## రైల్వే డ్రైవర్ల కుదింపును వెంటనే విరమించుకోవాలి




కాజీపేటలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట, మార్చి 30 : కాజీపేట రైల్వే క్రూ ల్యాబీ నుంచి రైలు డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లను కుదిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేటలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాజీపేటలోని 185 మంది ఎల్పీలు, ఏఎల్పీలు, ఎల్‌ఐను కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. కాజీపేట జంక్షన్ పరిధిలోని వివిధ సెక్షన్లను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రైల్వే డివిజన్ హోదా దక్కకుండా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రైల్వేశాఖ చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోనేలా చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రమేశ్, కారు ఉపేందర్, సంటి రవి, మదన్ పాల్గొన్నారు.

## కవి సమ్మేళనంలో ఓరుగల్లు కవులు



కవితను వినిపిస్తున్న పొట్లపల్లి శ్రీనివాసరావు

పోచమ్మమైదాన్, మార్చి 30: హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కవి సమ్మేళనంలో ఓరుగల్లుకు చెందిన నలుగురు కవులు పాల్గొని, తమ గళం వినిపించారు. హనుమకొండకు చెందిన పొట్లపల్లి శ్రీనివాసరావు, నెల్లుట్ల రమాదేవి, బిల్లా మహేందర్, ఎండీ అన్వర్ కవి సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంత కోకిల మీద జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని వారు తెలంగాణ కవితాగానం చేశారు. అలాగే, హనుమకొండ వడ్డేపల్లిలోని జీఎంఆర్ బృందావన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చండీ ఉపాసకులు సాయికృష్ణశర్మ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు.

## వేణుగోపాలస్వామి ఆలయానికి ఫ్యాన్ల బహూకరణ



అర్చకుడికి ఫ్యాన్లు అందిస్తున్న రవీందర్‌గౌడ్

ఆత్మకూరు, మార్చి 30 : ఆత్మకూరులోని వేణుగోపాల స్వామి ఆలయ భక్తుల సౌకర్యార్థం 3 ఫ్యాన్లను పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ ఆదివారం అర్చకుడు మాధవ మూర్తికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తుల కోసం ఫ్యాన్లు అందజేశానన్నారు.

## కమలాపూర్‌లో పాస్టర్ల ర్యాలీ

కమలాపూర్, మార్చి 30 : పాస్టర్ ప్రవీణ్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఏపీ ప్రభుత్వం విచారణ జరిపించాలని పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గూడూరు క్రాస్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ప్రవీణ్ చిత్రపటంతో నిరసన ర్యాలీ చేపట్టారు.

## రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

- డాక్యుమెంట్ల జారీలో అలసత్వం
- రోజులతరబడి కార్యాలయం చుట్టు ప్రదక్షణలు
- ఇబ్బందులు పడుతున్న క్రయ, విక్రయదారులు

హనుమకొండ, మార్చి 30 : రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో భూ క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత కూడా డాక్యుమెంట్ల జారీలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ చేసేందుకు కొర్రీలు పెడుతున్న సబ్ రిజిస్ట్రార్లు పైసలు ముట్టచెప్పి రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం డాక్యుమెంట్లు అందజేయడంలో సైతం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ రోజు కాని మరుసటి రోజు కానీ డాక్యుమెంట్లు అందజేస్తారు. కానీ వరంగల్ ఆర్వో కార్యాయలంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతున్నది. వారం, పది రోజులు కానిదే డాక్యుమెంట్లు ఇవ్వడం లేదు. డాక్యుమెంట్ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీస్తే ఇంకా స్కానింగ్ కాలేదు.. సారు సంతకం చేయలేదు.. సర్వర్ చాలా స్లోగా ఉందనే సమాధానాలు చెబుతున్నట్లు సమాచారం. ఇప్పటికీ వారం రోజులకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రతి రోజు ఆర్వో కార్యాలయంలో సరాసరి 50 నుంచి 90 దస్తావేజులు రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల అలసత్వంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కూడా డాక్యుమెంట్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నదని పలువురు మండిపడుతున్నారు. వివిధ కారణాలు చెపుతూ డాక్యుమెంట్లు జారీ చేయకపోవడంతో పలువురు ఆఫీసుకు వచ్చి గొడవలు పడ్డ సందర్భాలున్నాయి. అయినప్పటి అధికారుల తీరులో మార్పు రావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు డాక్యుమెంట్లు వెంట వెంటనే జారీ చేసేలా సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. డాక్యుమెంట్ల జారీ ఆలస్యంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌ను ఫోన్‌లో సంప్రదించగా, స్కానింగ్ చేసే ఉద్యోగి అనారోగ్యానికి గురయ్యాడు.. ఇటీవలనే విధుల్లో చేరాడు. దీంతో స్కానింగ్ చేయడం ఆలస్యం అవుతున్నది. వారం, పది రోజులు అనేది అవాస్తం. రెండు మూడు రోజుల డాక్యుమెంట్లే ఉన్నాయని, వాటిని త్వరలోనే అందజేస్తామన్నారు.

## కవి గిరిజా మనోహర్‌బాబుకు ఉగాది పురస్కారం



ప్రముఖ కవి గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబును సన్మానిస్తున్న కృష్ణవేణి కళా సమితి నిర్వాహకులు

పోచమ్మమైదాన్, మార్చి 30 : సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు, హనుమకొండ విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ కవి, రచయిత గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబుకు ఉగాది జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా కృష్ణవేణి కళాసమితి వరంగల్ ఆధ్వర్యంలో కొత్తవాడలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజా మనోహర్‌బాబు సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి, కృష్ణవేణి కళా సమితి తరఫున ప్రత్యేకంగా ఈ పురస్కారం అందజేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కళా సమితి అధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్-మాలతితో పాటు నగరానికి చెందిన 40 మంది కవులు, 35 మంది బాలకవులు పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో హాజరైన కవుల్లో మహ్మద్ సిరాజుద్దీన్, ప్రగల్లపాటి రాజ్‌కుమార్, గజవెల్లి నరసింహస్వామి, అరవింద శనిగరపు రాజ్‌మోహన్, బిటావరపు శ్రీమన్నారాయణ, నక్క కుమారస్వామి, వనపర్తి పద్మావతి, అరుణ కీర్తి పతాకరెడ్డి, ఉదయశ్రీ, సంగీత, ఈగ భవాని, దోమల భిక్షపతి, సింగర్ సాణశ్రీ, దుర్గాచారి, బాలకవులు అభినందన, అక్షర, హాసిని, విద్యావతి, ప్రిన్సిపాల్ కల్యాణ్‌రామ్, రాజేంద్రప్రసాద్, బీ సత్యనారాయణ, శిరీష, వ్యాఖ్యాతగా మల్లోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, మేయర్





హనుమకొండ/వరంగల్, మార్చి 30 : ముస్లింలకు కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, రంజాన్ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని వారు ఆకాంక్షించారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి నిష్ఠతో దైవాన్ని ఆరాదిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారన్నారు.

# వడ్ల కొనుగోలుకు సమాయత్తం

- 1,18,000 ఎకరాల్లో వరిసాగు
- దిగుబడి అంచనా 3,50,000 టన్నులు
- జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు చేస్తున్న సివిల్ సప్లయ్ శాఖ అధికారులు

హనుమకొండ, మార్చి 30 : యాసంగి సీజన్ వడ్లు కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతున్నది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సివిల్ సప్లయ్ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వరి సాగు లెక్క తేలడంతో దిగుబడి అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా గత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్లలో ఎక్కడా ఇబ్బందులు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. యాసంగిలో జిల్లాలో 1.18లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, సుమారు 3,50,000 టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో సివిల్ సప్లయ్ శాఖ 1,57, 200 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరి కోతలు ప్రారంభం కాగానే దశల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. వర్షం వచ్చినా ధాన్యం తడువకుండా ఉండేందుకు టార్పాలిన్లు, సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు. అదే విధంగా ధాన్యం రవాణాకు జిల్లాను ఐదు సెక్టార్లుగా విభజించారు. ఏప్రిల్ రెండో వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు మిల్లులను ట్యాగింగ్ చేయనున్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

**జిల్లా లక్ష్యం 1,57,200 టన్నులు..**

యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,18,000 ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, దీని ద్వారా పంట దిగుబడి 3,50,000 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో కొనుగోలు కేంద్రాల ద్వారా 1,57,200 టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. వీటిలో సన్నర రకం ధాన్యం 31,601టన్నులు, దొడ్డు రకం 1,25,599 టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. మిగిలిన ధాన్యాన్ని మిల్లర్లు, స్థానిక అవసరాలు, విత్తనాల కోసం సేకరిస్తామని అధికారులు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 63 రైస్ మిల్లులకు మిల్లింగ్ చేసేందుకు కేటాయించారు. వీటిలో 49 రా రైస్ మిల్లులు, 14 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. సన్న ధాన్యం గ్రేడ్ ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,320, కామన్ (దొడ్డు) రకానికి రూ.2,300లు మద్దతు ధర నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు 154 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీకి సంబంధించి 44, పీఏసీఎస్‌కు సంబంధించి 102 కేంద్రాలు ఉన్నాయి.


**ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. గన్నీ సంచులు, టార్పాలిన్లు, వేయింగ్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చరైజర్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు 39,30,000 గన్నీ సంచులు కావాల్సి ఉండగా ప్రస్తుతం 10,03,207 అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 29లక్షల సంచులను సమకూర్చుకునే పనిలో అధికారులు ఉన్నారు. అలాగే 5,880 టార్పాలిన్లు, 150 ప్యాడీ క్లీనర్లు, 150 గ్రేన్ క్యాలీపర్లు, 175 మాయిశ్చర్ మీటర్లు, 225 ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, 150 ఆస్కు రియవర్‌లు అవసరం ఉన్నాయని అధికారులు చెప్పారు.

**రవాణాకు ఐదు సెక్టార్లు..**

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రవాణా చేసేందుకు ధర్మసాగర్, భీమదేవరపల్లి, కమలాపూర్, హసన్‌పర్తి, శాయంపేట ఇలా ఐదు సెక్టార్లుగా విభజించారు. ధర్మసాగర్ సెక్టార్‌లో ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి సెక్టార్‌లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ సెక్టార్‌లో కమలాపూర్, పరకాల, నడికూడ మండలాలను చేర్చారు. హసన్‌పర్తి సెక్టార్‌లో హసన్‌పర్తి, కాజీపేట, ఐనవోలు, హనుమకొండ, శాయంపేట సెక్టార్‌లో శాయంపేట, ఆత్మకూరు, దామెర, మండలాలు ఉన్నాయి.

**ఏర్పాట్లు చేస్తున్నాం..**
**– మహేందర్, సివిల్ సప్లయ్ డీఎం**



యాసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు జిల్లాను ఐదు సెక్టార్లుగా విభజించాం. ప్రభుత్వం సూచించిన నిబంధనలను రైతులు తప్పకుండా పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలి. ఏప్రిల్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే అవకాశం ఉంది.

## ప్రజలకు సకల శుభాలు కలగాలి
### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హనుమకొండ, మార్చి 30 : ఉజ్వల భవిష్యత్‌కు ఈ ఉగాది తోడ్పడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది పండుగ ప్రజలందరికీ సకల శుభాలు పంచాలన్నారు. ప్రజల జీవితాల్లో సుఖ శాంతులు తేవాలని, కష్టాలు, నష్టాలు తొలగి ఆనందమయ జీవితాలకు ఈ పండుగ నాంది కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరుగాలన్నారు. సమృద్ధిగా వర్షాలు కురువాలని, పంటలు బాగా పండి రైతులు బాగుండాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలన్నారు.



ఉగాది పురస్కారాలు అందుకున్న వారితో దాస్యం వినయ్ భాస్కర్

## బీఆర్‌ఎస్ ఆఫీసులో పంచాంగ శ్రవణం
### పలువురికి ఉగాది పురస్కారాల అందజేత

హనుమకొండ, మార్చి 30 : శ్రీ విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది, ఉగాది పర్వదినం సందర్భంగా బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పండితుడు జగన్ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం విశిష్ట సేవలందించిన వారికి ఉగాది పురస్కారాలు అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో భద్రకాళి శేషు, పూజారి జగన్, ఫొటోగ్రాఫర్లు గొట్టె వెంకన్న, వీరగోని హరీశ్, దాసరి శ్రీనివాస్, కే అనితారెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, రఘువీర్ సప్తపది, వైల్డ్‌లైఫ్ నాగేశ్వర్‌రావు, ఉర్దూ కవి సిరాజొద్దీన్, ఒయాసిస్ అనాథాశ్రమ నిర్వాహకులు ప్రకాశ్ ఉన్నారు. కార్యక్రమంలో దాస్యం రేవతి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు పోలపల్లి రామ్మూర్తి, చింతల యాదగిరి, రాజు, రజిత, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ మూత
### ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మూతబడిన ఆధార్ కేంద్రం

శాయంపేట, మార్చి 30 : శాయంపేటలోని ఆధార్ సెంటర్ మూతబడింది. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం ఎదుట ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రం ఆపరేటర్‌ను తప్పుడు డాక్యుమెంట్ల వల్ల సస్పెండ్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో కొద్ది రోజులుగా ఆధార్ కేంద్రం తెరవడం లేదు. కొత్తవారిని అధికారులు నియమించ లేదు. ఈ క్రమంలో ఆధార్ కొత్త ఎన్‌రోల్‌మెంట్ ఆగిపోయింది. ఆధార్ కేంద్రం మూతపడడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆధార్‌కార్డులో ఆంధ్రప్రదేశ్ అని ఉంటే ఆర్టీసీ బస్సులో కండక్టర్లు అభ్యంతరాలు చెబుతున్నారని అంటున్నారు. జనం పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా అధికారులు మరో ఆపరేటర్‌ను నియమించి కేంద్రాన్ని తెరిపించాలని కోరుతున్నారు.

## ఘనంగా ఫకీర్‌షావలి జాతర



30సబ్02బి గుట్టపైకి వెళ్తున్న భక్తులు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 30 : మండలంలోని దామెర గ్రామంలో ప్రతి ఏటా ఉగాది రోజు జరుపుకునే ఫకీర్‌షావళి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది నాడే ముస్లింలు ఫకీర్‌షావళి జాతర జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఉగాది రోజు హిందువులు భక్షాలు, పిండి వంటలు చేసుకొని పచ్చడి తాగిన అనంతరం సాయంత్రం గ్రామంలోని గుట్టపై గల ఫకీర్‌షావళి సమాధుల వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా హిందూ, ముస్లిం యువకులు ఫకీర్‌షావళికి సంబంధించిన జెండాలను చేత పట్టుకొని గుట్టపైకి నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. ఈ జాతరకు మండలం నుంచే కాకుండా భీమదేవరపల్లి, హసన్‌పర్తి, ధర్మసాగర్, హుజూరాబాద్, హనుమకొండ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు
### ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్/హనుమకొండ చౌరస్తా, మార్చి 30 : ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం భద్రకాళీ ఆలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వసంత నవరాత్రోత్సవాలను ప్రారంభించారు. తెల్లవారుజామున 4 గంటలకు ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణాభిషేకం చేసి లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి-సురేందర్ దర్శించుకున్నారు. ఐనవోలు రాధాకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈవో శేషుభారతి ఉన్నారు.

**వేయిస్తంభాల దేవాలయంలో..**

హనుమకొండ చౌరస్తా : చారిత్రక రుద్రేశ్వరాలయంలో విశ్వావసు నామ ఉగాది ఉత్సవం ఉదయం 5 గంటలకు మంగళవాయిద్య సేవతో ప్రారంభమైంది. గణపతికి నవరసాభిషేకం, రుద్రేశ్వరునికి రుద్రాభిషేకం అనంతరం షడ్రుచుల ప్రసాదాన్ని నివేదించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అనంతరం విష్ణు ఆలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. గుదిమెళ్ల విజయకుమారాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆగమానుసారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఎమ్మెల్యే నాయిని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పండితుడు ఐనవోలు రాధాకృష్ణశర్మ పంచాంగ శ్రవణం చేశారు. తాడూరి రేణుక శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు, స్వాగత నృత్యం భక్తులను అలరించాయి. కవులు పొట్లపల్లి శ్రీనివాసరావు, ఆచార్య బన్న ఐలయ్య, మహ్మద్ సిరాజుద్దీన్, వీఆర్ విద్యార్థి, వల్స పైడి, బిల్లా మహేందర్, నెల్లుట్ల రమాదేవి, వకుళవాసు రామరత్నమాల, గట్టు మహేశ్‌బాబు, సిరిసిల్ల రాజయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.



హనుమకొండ చౌరస్తా : కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, గంగు ఉపేంద్రశర్మ